# ఈవీఎంలకు పటిష్ట భద్రత

**• రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ • కలెక్టర్ గౌతమ్‌తో కలిసి 'హోలీమేరి'లో కౌంటింగ్ కేంద్రం పరిశీలన**



హోలీమేరి ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ చౌహాన్, మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

కీసర, డిసెంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మీట నొక్కి ఓట్లు వేసిన ఈవీఎంల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. శుక్రవారం కీసర మండలంలోని హోలీమేరి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ డీఎస్ చౌహాన్ ఈనెల 3వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు జరుగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమయంలో ఉన్నతాధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హోలీమేరి ఇంజినీరింగ్ కళాశాలో భద్రత ఏర్పాట్లను పరిశీలించి పోలీసు సిబ్బందికి, సెంట్రల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆదివారం మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఇక్కడే జరుగుతుందన్నారు.కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య కౌంటింగ్ కొనసాగుతుందన్నారు.

కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ 3న ఎన్నికల కౌంటింగ్ ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవాంతరాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. స్ట్రాంగ్ రూంల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరుపాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది రాకపోకల కోసం వేర్వేరు మార్గాలతో ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టెబుల్స్ ఇతర అన్ని ఏర్పాట్లు నిశితంగా పరిశీలించారు.

కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీసీపీ జానకి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, జిల్లా పరిశీలకులు ఎస్‌కే జైన్, పూర్వాగార్గ్, అమన్ మిట్టల్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలే మళ్లీ గెలిపిస్తాయి..

**• మంత్రి చామకూర మల్లారెడ్డి**



మంత్రి మల్లారెడ్డిని కలిసిన ఎదులాబాద్, మర్రిపల్లిగూడ బీఆర్ఎస్ నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 1 : ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపిస్తాయని మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. మండలంలోని ఎదులాబాద్, మర్రిపల్లిగూడ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మంత్రి మల్లారెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు కంటున్న కలలు కల్లలు అవుతాయని, భారీ మెజారిటీతో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అకుంఠిత దీక్షతో పని చేసినట్లు తెలిపారు. ప్రతిపక్షాలు చేస్తున్న విష ప్రచారాలకు కార్యకర్తలు అధైర్యపడొద్దని, ధైర్యంగా ఉండాలన్నారు. మేడ్చల్ గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు అల్లం శంకర్, లక్ష్మణ్, చిరంజీవి,శ్రీనివాస్, రవి, మంకయ్య, శ్రీకాంత్, బాల్‌రాజు, రాజశేఖర్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

## మంత్రిని కలిసిన శామీర్‌పేట నేతలు



మంత్రి మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు

శామీర్‌పేట, డిసెంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని శామీర్‌పేట ఎంపీపీ ఎల్లూబాయిబాబు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఐలయ్యయాదవ్, పార్టీ మండలాధ్యక్షుడు సుదర్శన్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మంత్రి మల్లారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మేడ్చల్ గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగరవేసి సీఎం కేసీఆర్‌కు కానుకగా అందిస్తామన్నారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, శ్రీరాములు, మైసయ్య, పవన్‌ముదిరాజ్ ఉన్నారు.

## మంత్రి మల్లారెడ్డి గెలుపు ఖాయం

కీసర, డిసెంబర్ 1; మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో మంత్రి చామకూర మల్లారెడ్డి చేసిన అభివృద్ధి పనులే ఆయన్ను గెలిపిస్తాయని శుక్రవారం పలువురు విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి ఖాయమన్నారు.

## మంత్రి మల్లారెడ్డి గెలుపుపై బీఆర్ఎస్ నాయకుల ధీమా

ఘట్‌కేసర్, డిసెంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మేడ్చల్ అభ్యర్థి, మంత్రి చామకూర మల్లారెడ్డి విజయభేరి మోగిస్తారని ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలు మల్లారెడ్డిని గెలిపిస్తారని పోచారం మున్సిపల్ చైర్మన్ బి.కొండల్‌రెడ్డి, ఘట్‌కేసర్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, పార్టీ మున్సిపల్ అధ్యక్షులు మందాడి సురేందర్‌రెడ్డి, బి. శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు శుక్రవారం ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు.

## మేడ్చల్‌లో రెండు రోజులపాటు ఉర్సు

మేడ్చల్, డిసెంబరు 1 : మేడ్చల్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలోని మసీద్‌లో శని, ఆదివారాల్లో ఉర్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటలకు గంధం ఊరేగింపు, ఆదివారం చిరాగాహ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



రాంపల్లిదాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ఎదుట ధర్నాకు దిగిన అయ్యప్ప భక్తమండలి సభ్యులు

## అయ్యప్ప భక్తుల ధర్నా, నిరసన

కీసర, డిసెంబర్ 1 : అయ్యప్పమాల ధరించిన 5వ తరగతి బాలికను స్కూల్‌కు అనుమతించని జూబ్లీహిల్స్ స్కూల్ యాజమాన్యం తీరును మండలంలోని అయ్యప్ప భక్తులు నిరసిస్తూ ధర్నా చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కీసర మండలం రాంపల్లిదాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో అదే గ్రామానికి చెందిన బాలిక 5వ తరగతి చదువుతూ అయ్యప్ప మాల ధరించింది. దాంతో పాఠశాల యాజమాన్యం ఆమెను పాఠశాలకు అనుమతించకపోవడంతో ఈ విషయం తెలుసుకున్న మండల అయ్యప్ప భక్తులు శుక్రవారం పెద్ద ఎత్తున పాఠశాలకు చేరుకొని ధర్నాకు దిగారు. మాల ధరించిన బాలికకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్కూల్ గూట్లపై కర్రలతో దాడి చేశారు. ఇప్పటికైనా బాలికను పాఠశాలకు అనుమతించాలని వారు డిమాండ్ చేశారు.

# ఫలితాల కోసం నిరీక్షణ!

**• ఉత్కంఠగా ఎదురుచూస్తున్న నేతలు, ప్రజలు**




ఈవీఎంలను హోలీమేరి ఇంజినీరింగ్ కళాశాలకు తరలిస్తున్న పోలీసులు

కీసర, డిసెంబర్ 1; అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో ఫలితాలపై నియోజకవర్గ నాయకులు, ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. మేడ్చల్ జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపును ఆదివారం కీసర మండలం భోగారంలోని హోలీమేరి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. కౌంటింగ్‌కు సంబంధించి కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. ఎన్నికలు ముగియడంతో ఈవీఎంలను పోలీస్ బందోబస్తు మధ్య హోలీమేరి ఇంజినీరింగ్ కళాశాలకు తరలించి గట్టి భద్రత కల్పించారు.

అయితే ఎన్నికలు ముగిసిన క్షణాల్లోనే పలు సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌ను విడుదల చేశాయి. ఎగ్జిట్ పోల్స్ ఆదివారం వచ్చే ఫలితాలను తారు మారు చేస్తాయని, రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఆ పార్టీ మండల నాయకులు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని పేర్కొంటున్నారు.

## 62.24 శాతం పోలింగ్‌తో మేడ్చల్ టాప్

మేడ్చల్, డిసెంబరు 1 : మేడ్చల్ నియోజకవర్గంలో అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మేడ్చల్ 62.24 శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. నియోజకవర్గంలో 3,28,225 మంది పురుషులు, 3,09,566 మంది మహిళా ఓటర్లు, 48 మంది ఇతరులు ఉన్నారు. గురువారం జరిగిన పోలింగ్‌లో మొత్తం 3,96,794 మంది ఓటు హక్కును వినియోగించుకోగా అందులో 2,01,794 మంది పురుషులు, 1,95,172 మంది మహిళలు, ఇతరులు నలుగురు ఉన్నారు. మొదటి నుంచి నెమ్మదిగా సాగిన పోలింగ్ చివరి రెండు గంటల్లో జనం పెద్ద ఎత్తున తరలి రావడంతో భారీగా నమోదైంది. ఒక్కసారిగా ఓటర్లు తరలిరావడంతో దాదాపు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరాల్సి వచ్చింది. సాయంత్రం 5 గంటల వరకు 54.62 శాతానికి చేరుకుంది. ఐదు గంటలలోపు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న వారికి ఓటు వేయడానికి అనుమతివ్వడంతో ఒక్కో కేంద్రంలో రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. చివరకు పోలింగ్ శాతం 62.24కు చేరుకున్నది. 2018 ఎన్నికల్లో కంటే ఈ సారి పోలింగ్ శాతం 1.52 శాతం అధికంగా నమోదైంది. ఆ ఎన్నికల్లో 3,04,361 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఫిట్స్‌తో చెరువులో పడి వ్యక్తి మృతి

మేడ్చల్, డిసెంబరు 1 : చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ రైల్వేస్టేషన్ రోడ్డులో నివాసం ఉంటున్న వాల్గోట్ మోహన్‌రెడ్డి(48) కార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం 9 గంటల సమయంలో మోహన్‌రెడ్డి మెయిన్ రోడ్డు వరకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయల్దేరాడు. తుమ్మ చెరువు కట్టపై నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా ఆకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి చెరువులో పడిపోయాడు. ఫిట్స్‌తో అపస్మారక స్థితిలో ఉండటంతో చెరువులో మునిగి మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


